
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 20 । జనవరి । 2023



సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1216 క్యూసెక్కులు విడుదల చేశారు. పలు కాలువలకు 1054 క్యూసెక్కులు విడుదల చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.7200 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 2000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : గుంటూరు జిల్లా వ్యాప్తంగా గురువారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.


న్యూస్‌రీల్

8,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



గుంటూరువెస్ట్: ఖరీఫ్ పంట కాలానికి జిల్లాలో ఇప్పటి వరకు 1132 మంది రైతుల నుంచి 8600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ జి.లక్ష్మి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికిగాను ఇప్పటివరకు రూ.7.40 కోట్లు చెల్లించామన్నారు. ధాన్యం సేకరించిన 21 రోజులలోపే రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నామని తెలిపారు. దీంతో పాటు గోతాలు, హమాలీ ఖర్చులు, రవాణా వ్యయం కూడా ధాన్యం డబ్బులతోపాటు ఖాతాల్లో వేస్తున్నామన్నారు. జిల్లాలో 102 ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుపుతున్నామన్నారు. నిత్యం రైతులకు అందుబాటులో ఉండేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 94913 92717 ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామని చెప్పారు. రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కరించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని అన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 572.80 అడుగుల వద్ద ఉంది. ఇది 263.5928 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 9,700, ఎడమకాలువకు 6,556, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 12,978, ఎస్ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 31,954 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 31,954 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 846.10 అడుగుల వద్ద ఉంది. ఇది 72.1974 టీఎంసీలకు సమానం.

22న చేనేత కార్మిక సంఘాల రౌండ్ టేబుల్

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): చేనేత కార్మిక సంఘాల ప్రతినిధులు, శ్రేయోభిలాషుల రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 22న గుజ్జనగుండ్లలోని ప్రగడ కోటయ్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సామాజిక న్యాయ కేంద్ర రాష్ట్ర కన్వీనర్ వై.కోటేశ్వరరావు (వైకే) గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 2023–24 వార్షిక బడ్జెట్లలో చేనేతలకు నిధులు కేటాయింపులు, చేనేత పరిశ్రమ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,000, గరిష్ట ధర రూ.2,700, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.

విదేశీ అతిథులు వచ్చేనండి

- వెలమవారిపాలెంలో పక్షుల సందడి
- వైట్‌స్టార్క్ జాతిపక్షుల వలసకు వందేళ్లకుపైగా చరిత్ర
- సంక్రాంతి పండుగ నుంచి ఆరునెలలు గ్రామంలోని చెట్లపై మకాం
- కంటికి రెప్పలా కాపాడుకుంటున్న గ్రామ ప్రజలు

బల్లికురవ: ప్రకృతి మనకు దేవుడిచ్చిన వరం. మానవ జీవితోపాటు పశుపక్ష్యాదులు కూడా మనతోపాటే ఉంటున్నాయి. ఎక్కడో దేశం కాని దేశానికి వచ్చి పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి వైట్ స్టార్క్ జాతి పక్షులు. బాపట్ల జిల్లా బల్లికురవ మండలం వెలమవారిపాలెం గ్రామంలో ఆరునెలల పాటు విదేశీ పక్షుల రాకతో ప్రతి రోజూ పండగే. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలు, మండలాల నుంచి పర్యాటకులు పక్షులను చూసేందుకు వస్తుండటంతో అతిథులతో సందడిగా మారింది. ఎక్కడ కొరియా, నైజీరియా.. ఎక్కడ వెలమవారిపాలెం సుమారు కొన్ని లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ అతిథులుగా వచ్చి ఇక్కడి ఆతిథ్యం స్వీకరిస్తున్నాయి. ప్రతి సంవత్సరం జనవరి మొదటి, రెండు వారాల్లో ఆడపక్షులు గ్రామానికి వచ్చి చెట్లపై గూళ్లు కట్టుకుని నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. ఇక్కడ నివసించే ఆరునెలలు గుడ్లను పొదిగి పిల్లలకు రెక్కలు రాగానే జూలై మాసాంతంలోపు స్వదేశానికి తిరిగి వెళ్తాయి. 4 నుంచి 5 అడుగుల ఎత్తు ఉండే ఈ పక్షులు గుడ్డు నుంచి బయటకు రాగానే తెలుపు రంగులో ఆరు నెలలకు ఐదు రంగుల్లో కనిపిస్తాయి.



వెలమవారిపాలెంలో చెట్లపై సేదతీరుతున్న విదేశీ పక్షులు

సుమారు 460 పక్షులు..

ఆడపక్షులు గుడ్లు పెట్టి పొదిగే దశలో మగ పక్షులే గ్రామంతోపాటు పరిసరాల్లో 50 కిలోమీటర్ల దూరం వరకు వెళ్లి ఆహారం సేకరించి తెచ్చి పెడుతున్నాయని గ్రామస్తులు సాక్షికి తెలిపారు. గ్రామస్తులు ఎవరిని పలకరించినా తమ తాత, ముత్తాతల కాలం నుంచి పక్షులతో తమకు అనుబంధం ఉందని, కన్న బిడ్డలతో సమానంగా ఆదరిస్తున్నట్లు చెప్పారు. పక్షులకు మంచినీటికి గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో కుంట ఏర్పాటు చేశారు.

నాలుగేళ్లుగా పక్షులకు పండగ..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక విస్తారంగా వర్షాలు కురవటం, పంటలు పండటంతో పక్షులకు తాగునీటికి, ఆహారానికి కొరతలేదు. 2019కి ముందు 5 సంవత్సరాలపాటు పక్షులు అన్ని రకాలుగా ఇబ్బందులకు గురైనట్లు గ్రామస్తులు వివరించారు. గ్రామంలో చింత చెట్లు తగ్గటంతో వేప, తుమ్మ చెట్లను ఆవాసంగా మార్చుకున్నాయి. గ్రామం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూమిలో చింతచెట్లు పెంచి పక్షులకు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చాలి



పక్షులకు గ్రామంలో రక్షణలేదు. నాలుగేళ్ల కిందట ఓ ముఠా రాత్రి నిద్రిస్తున్న పక్షులను గోతాల్లో వేసి మాంసం దుకాణాలకు విక్రయించేందుకు తరలించే ప్రయత్నం చేయగా పక్షుల అరుపులకు నిద్రలేచి అడ్డుకున్నాం. ఈ విషయాలను ఇటీవల గ్రామానికి వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు విన్నవించాం. పక్షుల రక్షణకు వాచ్‌మన్‌ను నియమించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వేడుకోగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు.

- టీ.సరేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు

బంధువులుగానే భావిస్తున్నాం..



తరాలుగా పక్షులతో అనుబంధం ఉంది. సంక్రాంతి పండుగకు ఆడపిల్లలు, అల్లుళ్లు వచ్చినట్లుగా మా గ్రామానికి నైజీరియా, కొరియా పక్షులు వచ్చి సందడి చేస్తున్నాయి. పర్యాటక కేంద్రంగా అభివృద్ధితోపాటు ప్రభుత్వ భూముల్లో చెట్ల పెంపకాన్ని చేపట్టటంతోపాటు గ్రామానికి వచ్చే ప్రధాన మూడు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

- నూనె ప్రభుదాసు, సర్పంచ్

బ్యాంకులు వ్యవసాయ రుణాలు అందించాలి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



బాపట్ల: జిల్లాలో వ్యవసాయ అనుబంధ రంగాలకు రాబోయే సంవత్సరంలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ఆదేశాల మేరకు రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం హాలులో జిల్లా స్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2023 సంవత్సరం ఖరీఫ్ పంటలకు, 2023–24 సంవత్సరం రబీ పంటలకు బ్యాంక్ రుణాలు అందించడానికి జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ నివేదికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీకి పంపడం జరుగుతుందన్నారు. గణతంత్ర దినోత్సవం రోజున పీఎంఈజీపీ పథకం కింద 161 యూనిట్లు, బడుగు వికాస పథకం కింద 100 యూనిట్లు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎం కృష్ణనాయక్, కన్వీనర్ టి.కృష్ణవేణి, జీడీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శివరావు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలకు పట్టం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- వైభవంగా కొండవీడుకోటపై వేమన జయంతి
- అభివృద్ధిపై సీఎం దృష్టి సారించినట్లు వెల్లడి

యడ్లపాడు: భాష, సంస్కృతి, చారిత్రక వారసత్వ సంపదలను కాపాడి వాటిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశ్వకవి యోగి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు కోట పర్యాటక కేంద్రంలో గురువారం ప్రజాకవి వేమన జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తొలుత కొండవీడు కొండపై ఉన్న వేమన విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో బాలభారతి–కొండవీడుకోట అభివృద్ధి కమిటీలు భాగస్వామ్యం వహించాయి. కార్యక్రమానికి కె.శివారెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి రజిని మాట్లాడుతూ ఒక్క వేమన జయంతి విషయంలోనే కాదు... కొండవీడు అభివృద్ధిలో ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. కొండవీడుకోట ఉనికి కోల్పోకూడదని రూ.70 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రెండోదశ ఘాట్‌రోడ్డు, పార్కు, పచ్చదనం, మౌలిక సదుపాయాలు కల్పించి కొత్త హంగులు తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనతో వేమన పద్యాలకు మరింత ప్రాచుర్యం లభించిందన్నారు. ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ యోగి వేమన సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకొంటూ, వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.



వేమన విగ్రహం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి విడదల రజిని, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్

వేమన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా మాట్లాడుతూ వేమన పద్యాలు సమసమాజ నిర్మాణానికి బాటలు వేశాయని అన్నారు. వేమన చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడుతూ వేమన పద్యాల్ని అభిమానిస్తే..శతక సాహిత్యాన్ని గౌరవించినట్లేనని అన్నారు. ప్రజల జీవన విధానం పద్యాల రూపంలో వచ్చాయన్నారు. సరళమైన తెలుగు పదాలతో వేమన పద్యాలు మౌఖికంగా విశ్వ వ్యాప్తి అయ్యాయని పేర్కొన్నారు. ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలపై కాకుండా ప్రజల నాల్కలపై పద్యాలను రాసిన మౌఖిక కవి వేమన అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ వేమన జయంతికి నెల రోజుల ముందు నుంచే కొండవీడు కోటకు వచ్చే పర్యాటకులు, విద్యార్థులకు వేమన పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తున్నామన్నారు. వేమన శతకాల 7వ ముద్రణ ప్రతులు, నూతన సంవత్సరం కాలెండర్‌లను అతిథులు ఆవిష్కరించారు. డీఆర్వో వినాయకం, డీఎఫ్‌వో ఎస్ రామచంద్రరావు, యడ్లపాడు, ఫిరంగిపురం ఎంపీపీలు పి ఝాన్సీ, నర్గీస్, కొత్తపాలెం, కొండవీడు సర్పంచ్‌లు ఎంవీ సుబ్బారావు, మహమ్మద్ యూనీస్, ఘంటా శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వేమన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని, ఎమ్మెల్సీ డొక్కా, జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా

ప్రశాంత వాతావరణంలో కానిస్టేబుల్ పరీక్షలు

- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీస్‌యాక్ట్
- సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: కానిస్టేబుల్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఈ నెల 22న నిర్వహించే కానిస్టేబుల్ పరీక్షల ఏర్పాట్లపై జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం చీఫ్ కోఆర్డినేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాల్లో 8,567 మంది పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఆరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాత పరీక్ష ఉంటుందని తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటలలోపు పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించాలన్నారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కేంద్రంలోకి పంపాలన్నారు. అభ్యర్థులతోపాటు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రాలలోకి అనుమతించరాదన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ప్రింటింగ్, కోచింగ్ సెంటర్లు, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ షాపులను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మూసివేయించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రదేశంగా భావించి 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, బాపట్ల, చీరాల డీఎస్పీలు ఏ.శ్రీనివాసరావు, పి.శ్రీకాంత్, రీజనల్ కోఆర్డినేటర్ వేణుగోపాలరావు, పోలీస్ అధికారులు, చీఫ్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

సబ్‌ప్లాన్‌పై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, వారి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. గురువారం చీరాలలోని కొత్తపేటలో ఆమె నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సునీత మాట్లాడుతూ ఎస్సీల పుట్టుకను చంద్రబాబు తీవ్రంగా అవమానించారని, ఎస్సీ కులాల్లో ఎవరైనా పుడతారా.. అంటూ అవహేళన చేసిన చంద్రబాబుకు వారి గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ద్రోహిగా చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతారన్నారు. పెత్తందారీవర్గాల అభ్యున్నతికి పాటుపడే చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 90 శాతం వారి అభివృద్ధికి, విద్య, వైద్యం, సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. పచ్చ మీడియాను అడ్డు పెట్టుకుని ప్రతి చెడ్డమాటను మంచి రాతలుగా అడ్డగోలుగా రాయించుకుంటూ పబ్బం గడుపుకుంటున్నాడని చంద్రబాబుపై ఆమె ధ్వజమెత్తారు. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకున్న చందంగా ఎన్టీఆర్ పేరు చెప్పుకుని ఓట్లు అడుక్కుంటున్నాడేగానీ స్వతహాగా అతనికి ఎలాంటి అర్హత లేదని ఎద్దేవా చేశారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేద ప్రజలకు నవరత్నాలు అమలు చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి– సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తుంటే ఓర్చుకోలేని చంద్రబాబు.. ముఖ్యమంత్రి జగనన్నపై లేనిపోని విమర్శలు చేస్తున్నాడని మండిపడ్డారు.

- బాబు సభలో ముగ్గురు మృతిపై విచారణ
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేషశయనరెడ్డి

ప్రచార్భాటమే.. ప్రాణాలు తీసింది

మీడియా ఎదుట తొక్కిసలాట బాధితుల ఆవేదన

పట్నంబజారు/గుంటూరురూరల్: ''కొందరికి ఒళ్లంతా గాయాలు.. మరికొందరు సొమ్మసిల్లి పోయారు..ఇంకొందరు స్పృహ కోల్పోయారు.. కళ్ల ముందే తోటి మహిళలు ఊపిరి ఆడక విగతజీవుల్లా పడిపోయారు..సభా ప్రాంగణమంతా హాహాకారాలు.. భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ చూస్తూ ఉండిపోయాం''..అంటూ నూతన సంవత్సరం రోజున జరిగిన ఘటనలో గాయాలపాలైన మహిళలు విచారణ కమిషన్ ముందు చెప్పిన మాటలవి. నిర్వాహకుల ప్రచార్భాటమే ప్రాణాలు తీసిందని అన్నారు. ఈ నెల 1వ తేదీన ఉయ్యూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికాస్‌నగర్‌లో జరిగిన ఎన్టీఆర్ జనతా వస్త్రాలు..చంద్రన్న సంక్రాంతి కానుక పంపిణీ కార్యక్రమానికి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభ నిర్వహణ అనంతరం పంపిణీ కార్యక్రమం ప్రారంభించటంతో తొక్కిసలాట జరిగిన విషయం విదితమే. ఘటనలో కన్నావారితోటకు చెందిన ఆసియా, ఏటీ అగ్రహారానికి చెందిన గోపిదేశి రమాదేవి, షేక్ బీబీలు మృతి చెందగా సుమారు 30 మందిపైగా గాయాలపాలయ్యా రు. ఈ క్రమంలో గురువారం గుంటూరు వచ్చిన రిటైర్డ్ హైకోర్టు జడ్జి శేషశయనరెడ్డి ఆధ్వర్యంలో విచారణ ప్రారంభమైంది. తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన కమిషన్, ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో బాధితుల సాక్ష్యాలు సేకరించింది. ఈ ఘటనకు ప్రత్యక్షసాక్షులు, గాయపడిన వారు మొత్తం కలిపి 25 మంది స్టేట్‌మెంట్లను కమిషన్ రికార్డు చేసింది.



గుంటూరులో హైకోర్టు రిటైర్డు జడ్జి నిర్వహించిన విచారణకు హాజరైన బాధితులు

ఈ సంఘటన జరిగిన సమయంలో అక్కడే ఉన్న డీఎస్పీ సీతారామయ్య, సభకు అనుమతులు జారీ చేసిన డీఎస్పీ జెస్సీ ప్రశాంతి స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేసింది. ఈ క్రమంలో కొంత మంది బాధితులు మీడియాతో వారి మనోగతాన్ని.. ఘటన సమయంలో జరిగిన పరిస్థితులను వివరించారు.

చంద్రబాబు వచ్చి వెళ్ళే దాకా...



చంద్రబాబు వస్తున్నారని చెప్పి మధ్యాహ్నం మూడు గంటల నుంచి కూర్చొబెట్టారు. చీరలు ఇస్తామని ఆశ చూపి సభ అయ్యే వరకు ఎవరిని కదలనివ్వలేదు. ఉయ్యూరు ఫౌండేషన్ ఇచ్చిన టోకెన్లకు ముద్ర వేసేందుకు పెద్ద క్యూనే ఉంది. కూర్చున్న చోటకే చీరలు తెచ్చి ఇస్తామని చెప్పి నమ్మబలికారు. ఆఖరికి ముగ్గురు మహిళలను పొట్టనబెట్టుకున్నారు. ఎంతో మందికి గాయాలయ్యాయి. వయసు పైబడిన దానిని.. తొక్కిసలాటలో గుండెల్లో నొప్పితో ఎంతో బాధపడ్డాను.

-కుమ్మ విమలమ్మ, కృష్ణబాబుకాలనీ

కానుకలు ఆశ చూపితే వెళ్లామయ్యా..



పేద కుటుంబాలకు చెందిన వాళ్ళం..చంద్రన్న కానుకలు, చీరలు ఇస్తామని ఆశ చూపితే వెళ్లామయ్యా. తీరా అక్కడకు వెళ్లిన తర్వాత ఎన్నో ఇబ్బందులు పడ్డాం. కనీసం బారికేడ్లు దాటి బయటకు కూడా రానివ్వలేదు. టోకెన్లకు ముద్రలు వేసే చోట ఎంతో రద్దీ ఉంది. ఈ రద్దీలో ముద్రలు వేసిన తరువాత అక్కడకు వెళ్తే.. అనుకోని ఘటనతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యాం. సొమ్మసిల్లి పోవటంతో గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాతోపాటు నా కుమార్తె కూడా వచ్చింది కాబట్టే.. నేను క్షేమంగా బయటపడ్డాను.

-నల్లమేకల మంగమ్మ, తుఫాన్‌నగర్

జోరుగా మిర్చి క్రయవిక్రయాలు

కొరిటెపాడు(గుంటూరు): ఇటీవల కాలంలో ఎన్నడూ లేనంతగా గురువారం రైతులు 83,933 బస్తాలు యార్డుకు తరలించారు. ఈ–నామ్ ద్వారా 79,342 బస్తాలు విక్రయాలు జరిగాయి. మిర్చి ధరలు ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో రైతులు అమ్మకాలకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొత్త సరుకు యార్డుకు ఇప్పుడిప్పుడే వస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లాతోపాటు కర్నూలు, ప్రకాశం ప్రాంతాల నుంచి వచ్చే మిర్చి అంత నాణ్యతగా ఉండటం లేదు. తాలు ఎక్కువగా వస్తుంది. రైతులు నిల్వ పెట్టడం కంటే అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. మరీ తడిగా ఉన్న మిర్చిని యార్డుకు తీసుకువస్తున్నారని, ఫలితంగా ధరలపై ప్రభావం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఆరబెట్టి యార్డుకు తీసుకువస్తే ఆశించిన ధర పడే అవకాశం ఉందని సూచిస్తున్నారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 40,524 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

బ్రిడ్జి నిర్మాణానికి మట్టినమూనా పరీక్షలు

అచ్చంపేట:పల్నాడు జిల్లా అచ్చంపేట మండల సరిహద్దులోని మాదిపాడు నుంచి కృష్ణానదిపై ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వరకు బ్రిడ్జి నిర్మాణానికి నదీ లోతుల్లో మట్టినమూనాలు పరీక్షించేందుకు ఆర్వీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో మెర్క్యురీ ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ గురువారం పనులు చేపట్టింది. ప్రత్యేక యంత్రాలతో కృష్ణానది లోతుల్లో మట్టిని వెలికితీసి పటిష్టతను, నది లోతులను, ఇవతలి ఒడ్డు నుంచి అవతలి ఒడ్డు వరకు ఉన్న దూరాన్ని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి అనువైన ప్రాంతం క్షుణ్ణంగా పరిశీలించారు. డీపీఆర్ తయారు చేసే పనులలో నిమగ్నమయ్యారు.

క్యారమ్స్ పోటీలకు గుంటూరు జిల్లా జట్టు పయనం



జిల్లా క్యారమ్స్ జట్టుతో అబ్దుల్ జలీల్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): శుక్రవారం నుంచి విజయవాడలో జరగనున్న అంతర్ జిల్లాల జూనియర్ బాలబాలికల క్యారమ్స్ పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు గుంటూరు జిల్లా క్యారమ్స్ సంఘం కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం తెలిపారు. గత నాలుగు క్రితం జట్టును ఎంపిక చేసి తానే శిక్షణనిచ్చానన్నారు. ఈ పోటీలు రాష్ట్ర క్యారమ్స్ సంఘం పర్యవేక్షణలో జరుగుతాయని చెప్పారు.

జట్టులో బాలురు: టి.సంతోష్, ఎస్‌కే కాబా కౌశస్, ఎం.మనోజ్, జైసాయి, డి.దేవరాజ్, ఎస్‌కెవి కౌశిక్.

బాలికలు: బి.నవ్య, బి.శ్రీరమ్య, ఎస్‌కే ఫర్హీన్, ఎం.హర్షిత, డి.రాజ్యలక్ష్మి, జి.మయూక, యువకులు: ఎం.రాజ్ కుమార్, ఎస్.వి. శివప్రసాద్.

సమాజాన్ని చైతన్యపరిచిన యోగి వేమన

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిన అభ్యుదయవాది వేమన అని జిల్లా వకుల్‌జిందాల్ తెలిపారు. వేమన జయంతిను పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రజలకు అర్థమయ్యే భాషలో పద్యాలను వినిపించి, అందరిని మెప్పించిన మహాకవి వేమన అన్నారు. వేమన పద్యాలను వినని వారు, తెలియని వారుండరనడంలో అతిశయోక్తి లేదన్నారు. వేమన జయంతిను రాష్ట వేడుకగా నిర్వహించుకోవడం, భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన...

వేటపాలెం: కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలను బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం పరిశీలించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రాల ఏర్పాటుపై డీఎస్పీ శ్రీకాంత్, కళాశాల యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 20 తేదీ ఆదివారం కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. బాపట్ల జిల్లాలో 15 కేంద్రాలు ఏర్పాటు చేశామని, అందులో ప్రధానంగా సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రీజినల్ సెంటర్ ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో అన్ని కేంద్రాలను ఆయా ప్రాంతాల్లో పోలీస్ అధికారులు పరిశీలించారని తెలిపారు. వీరివెంట కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలరావు ఉన్నారు.

అలరించిన చిత్ర బృందం క్రికెట్ మ్యాచ్

వీవీఐటీలో 'వినరో భాగ్యము విష్ణుకథ' సందడి



క్రికెట్ ఆడుతున్న వినరో భాగ్యము విష్ణుకథ చిత్ర హీరో కిరణ్ అబ్బవరం

పెదకాకాని: అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్ బ్యానర్‌పై కిరణ్ అబ్బవరం, కాశ్మీరా హీరో, హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం వినరో భాగ్యము విష్ణుకథ ఫిబ్రవరి 17వ తేదీ విడుదల కానున్న నేపథ్యంలో సినిమా బృందం చిత్ర ప్రచారాన్ని వినూత్నంగా ప్రారంభించింది. నంబూరు వీవీఐటీ కళాశాలను గురువారం సందర్శించిన చిత్ర బృందం కళాశాల క్రికెట్ జట్టుతో క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొని విద్యార్థులను అలరించారు. ఈ క్రికెట్ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన విద్యార్థి కె.సైదులు చేతులు మీదుగా చిత్రంలోని 2వ పాట ఓ బంగారం అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ చిత్రం చాలా ప్రత్యేకమైందని, అందరినీ అలరించే విధంగా సినిమా రూపొందినట్లు తెలిపారు. అందరూ ఈ చిత్రాన్ని చూసి ఆదరించాలన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సినిమా పేరుకు తగిన విధంగా మంచి విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత బన్నీవాసు, దర్శకుడు కిషోర్ అబ్బూరి, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.అరుణ్‌కుమార్, డాక్టర్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం.. ఉత్కంఠభరితం

- ముగిసిన జాతీయ స్థాయి ఒంగోలు గిత్తల బలప్రదర్శన పోటీలు
- సీనియర్ విభాగం విజేతలు కృష్ణా జిల్లా ఎడ్లు



ఎడ్ల యాజమానికి మెమెంటో అందజేస్తున్న ఆమంచి కృష్ణమోహన్



సీనియర్స్ విభాగంలో బండ లాగుతున్న ఎడ్లజత

పర్చూరు: జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి గిత్తల బలప్రదర్శన పోటీలు విజయవంతంగా ముగిశాయి. అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో 35వ జాతీయ స్థాయి ఒంగోలు జాతి గిత్తల బలప్రదర్శన పోటీలలో భాగంగా బుధవారం రాత్రి జరిగిన సీనియర్స్ విభాగం పోటీల్లో కృష్ణాజిల్లా ఎడ్లజత విజేతగా నిలిచింది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్లజత 3967.03 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకుంది. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన దేవభక్తుని సుబ్బారావు ఎడ్లజత 3809.10 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని గెల్చుకుంది. తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా హైదరాబాద్‌కు చెందిన మేకా రామకృష్ణ ఎడ్లజత 3464.02 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా, శామీర్పేట్ హైదరాబాద్‌కు చెందిన రోహన్‌బాబుకు చెందిన ఎడ్లజత 3126.02 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకోగా, పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దప్పిలి అంజిరెడ్డి ఎడ్లజత 2313 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెల్చుకున్నాయి. కడప జిల్లా కాశినాయన మండలం ఆనవారిపల్లె గ్రామానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లజత 2298 అడుగుల దూరం లాగి ఆరవ బహుమతిని, ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం సంకేసుల గ్రామానికి చెందిన ముద్దపాటి శ్రీనివాసులు ఎడ్లజత 2283.01 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన కొప్పుల హేమలతా శ్రీనివాసరెడ్డి ఎడ్లజత 1352 అడుగుల దూరం లాగి ఏనిమిదో బహుమతిని గెల్చుకున్నాయి

సబ్ జూనియర్స్ విభాగంలో...

అన్నంభొట్లవారిపాలెం గ్రామంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ఆధ్వర్యంలో గత వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న 35వ జాతీయ స్థాయి బండలాగు ఎడ్లబలప్రదర్శన పోటీలు గురువారంతో ముగిశాయి. బుధవారం రాత్రి సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహించగా కృష్ణాజిల్లా మొదటి బహుమతిని గెల్చుకుంది. కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన బాలినేని మల్లికార్జునరావు అండ్ బ్రదర్స్ ఎడ్లజత 4515.8 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని గెల్చుకున్నాయి. బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణకు చెందిన సోమిశెట్టి ఆంజనేయులు ఎడ్లజత 4500 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని గెల్చుకున్నాయి. బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లజత 3966.10 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతిని గెల్చుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం చిననందిపాడు కు చెందిన గొల్లపూడి కుమారస్వామి ఎడ్లజత 3450.8 అడుగుల దూరం లాగి నాలుగవ బహుమతిని గెల్చుకోగా, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నంకు చెందిన వెలగాల హైమావతి ఎడ్లజత 3308.9 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం పాపాయపాలెంకు చెందిన మర్రి అచ్చిరెడ్డి ఎడ్లజత 3289.5 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని గెల్చుకున్నాయి. పల్నాడు జిల్లా, యడ్లపాడు మండలం, లింగారావుపాలెంకు చెందిన ఫణీంద్ర ఎడ్లజత 2429.8 అడుగుల లాగి ఏడవ బహుమతిని గెల్చుకున్నాయి.

– గురువారం సాయంత్రం సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీలలో మొత్తం ఏడు జతలు పాల్గొన్నాయి. 25 నిమిషాల సమయంలో 22 క్వింటాళ్ల బండను లాగాయి. పోటీలకు ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, చిలకలూరిపేట మాజీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్, గురజాల నియోజకవర్గ పరిశీలకుడు గొట్టిపాటి భరత్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం రైతులకు మెమెంటోలు అందజేశారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరుకు చెందిన దేశభక్తుని సుబ్బారావు ఎడ్లజత 3861.2 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన నల్లమోతు వీరయ్య చౌదరి ఎడ్లజత 2448.11 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం త్రిషజ్ఞారెడ్డి ఎడ్లజత 3489.3 అడుగుల దూరం లాగాయి. ప్రస్తుతం పోటీలు జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ నాయకులు తోకల కృష్ణమోహన్, మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, ముప్పాళ్ల రాఘవయ్య, కొల్లా శ్రీహరి, ఆకుల హేమంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదం



క్రికెట్ జట్టును అభినందిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: శారీరక సౌష్ఠవానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చినగంజాం మండలం, కడవకుదురులో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో బాపట్ల జిల్లా క్రికెట్ జట్టు తృతీయస్థానం సాధించింది. క్రికెట్ పోటీల్లో పాల్గొని బహుమతి సాధించిన జట్టును గురువారం జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో రాష్ట్రవ్యాప్తంగా 37 జట్లు పాల్గొనగా పోటీపడి బహుమతి సాధించడం హర్షనీయమన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించడం కోసం జిల్లా వ్యాప్తంగా అసోసియేషన్లతో, గ్రామ పెద్దలు, ఎన్జీఓల సహాయంతో అనేక క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐలు వీటిని స్వయంగా ప్రోత్సహించి మన సంప్రదాయాలకు సంస్కృతికి పెద్దపీట వేశారన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్ల: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం హాల్‌లో జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ రహదారులపై భద్రత చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రాష్ట్ర రహదారి జంపని వద్ద రూ.37లక్షలతో బ్లాక్ స్పాట్ వద్ద అభివృద్ధి పనులకు అంచనాలు ఆమోదించి ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. అలాగే వెల్లటూరు వద్ద రూ.2.5లక్షలతో, చీరాల ఆర్‌ఓబీ వద్ద రూ.18లక్షలతో, అద్దంకి వద్ద రూ.85వేలతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వారిని కాపాడటానికి బాపట్ల ఏరియా ఆసుపత్రిలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర రహదారిపై కడవకుదురు ఆర్‌ఓబీపై అత్యవసర పనులు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. బాపట్ల పట్టణంలో సర్కిళ్లను వెడల్పు చేయాలని చెప్పారు. అలాగే బాపట్ల పట్టణంలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో రహదారులపై భద్రతా చర్యలు తీసుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. జిల్లాలో గత సంవత్సరం జూలై వరకు నెలకు 28 వరకు రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. రహదారులపై భద్రతా చర్యల వల్ల ఇప్పుడు 14కి తగ్గాయన్నారు. బాపట్ల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ రాత పరీక్షకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న రీజనల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

- రీజనల్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు
- 18 కేంద్రాలు, 10,312 మంది అభ్యర్థులు

నరసరావుపేట ఈస్ట్: ఈ నెల 22వ తేదీ జరగనున్న పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా కట్టుదిట్టంగా నిర్వహించేందుకు సహకరించాలని పరీక్ష రీజనల్ కో–ఆర్డినేటర్, జేఎన్‌టీయూ–ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. కళాశాల ఆడిటోరియంలో గురువారం పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష నిర్వహణపై పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పరీక్ష నిర్వహణ విధి విధానాలను వివరించారు. పరీక్ష ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగుస్తుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 10 గంటలు దాటిన తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా ఎట్టిపరిస్థితుల్లోనూ అభ్యర్థులకు కేంద్రంలోకి అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్‌లు అనుమతించరని తెలిపారు. ఇన్విజిలేటర్లకు సైతం పరీక్ష హాల్‌లోకి ఫోన్ అనుమతి లేదన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన ఆధార్‌కార్డ్, ఓటర్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ఏదో ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని తెలిపారు. హాల్ టికెట్‌పై ఉన్న ఫొటో గుర్తింపుకార్డు ఫొటో సరిపోల్చుకొని అభ్యర్థులను పరీక్షా హాల్‌లోకి అనుమతివ్వాలని వివరించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు విధి నిర్వహణలో ఉన్న ఆయా కళాశాలల సిబ్బంది మినహా ఎవరిని పరీక్షా కేంద్రాల వద్దకు అనుమతించరని తెలిపారు.

18 కేంద్రాలు.. 10,312 మంది అభ్యర్థులు

నరసరావుపేట రీజియన్ పరిధిలో 10,312 మంది అభ్యర్థులు పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్షకు హాల్ టికెట్లు పొందారని ప్రొఫెసర్ శ్రీనివాసరావు తెలిపారు. వీరిలో 8,340 మంది పురుషులు కాగా, 1972 మంది మహిళలని వివరించారు. నరసరావుపేట కేంద్రంగా 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలంలో హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా శ్యామల నియామకం



గుంటూరు లీగల్: పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా కె.శ్యామలను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోనూ ఇదే కోర్టులో ఆమె స్పెషల్ పీపీగా మూడేళ్లు పని చేశారు. ఈ సందర్భంగా శ్యామల మాట్లాడుతూ తాను మళ్లీ స్పెషల్ పీపీగా కొనసాగేందుకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు చెప్పారు. శ్యామల ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, జీపీ పోకల వెంకటేశ్వరరావు, ఏపీపీలు వజ్రాల రాజశేఖరరెడ్డి, రమణారెడ్డి, గేరా సుబ్బారావు, సాగర్ తదితరులు శ్యామలకు అభినందనలు తెలిపారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి. పద్మావతి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

జే.పంగులూరు: పిల్లలు బడిలో.. పెద్దలు పనిలో ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండల పరిధిలోని చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె పరిశీలించారు. పాఠశాలలో పలు రికార్డులు, మధ్యాహ్నం భోజనం మెనూ పరిశీలించారు. అనంతరం పద్మావతి గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి పాఠశాలలో కంప్లెయింట్ బాక్స్ ఉండాలని సూచించారు. చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. బాలకార్మికుల వ్యవస్థ అరికట్టటానికి ప్రభుత్వం విద్యావిధానంలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. 8వ తరగతి నుంచే విద్యార్థలకు సీబీఎస్సీ సిలబస్, ట్యాబ్‌లు పంపిణీ వారి చదువుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ క్రిష్ణకుమారి, హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు

ఉత్తమ ప్రదర్శనగా 'చీకటిపువ్వు'



కళాపరిషత్ పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకుంటున్న కళాకారులు

యద్దనపూడి: ఐదురోజుల పాటు మండలంలోని అనంతవరం గ్రామంలో నిర్వహించిన ఉభయ తెలుగురాష్ట్రాల నాటిక పోటీలు బుధవారం అర్ధరాత్రి ముగిశాయి. చైతన్య కళాభారతి కరీంనగర్ వారు ప్రదర్శించిన 'చీకటిపువ్వు' ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ ప్రదర్శనగా రసఝరి పొన్నూరు వారు ప్రదర్శించిన 'గుర్తుతెలియని శవం', తృతీయ ప్రదర్శనగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ విజయవాడ వారి 'పిపీలికం', ఉత్తమ జ్యూరీ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారు ప్రదర్శించిన 'గమ్యస్థానాల వైపు' నాటిక నిలిచింది. అలాగే ఉత్తమ నటుడు రవీంద్రారెడ్డి (అతీతం), ఉత్తమ క్యారెక్టర్ యాక్టర్ వైఎస్ కృష్ణేశ్వరావు (గుర్తుతెలియని శవం), సహాయ నటుడిగా శివరామిరెడ్డి (చీకటిపువ్వు), ఉత్తమ దర్శకత్వం డాక్టర్ ఎం.చౌదరి (పిపీలికం), ఉత్తమ రచన పరమాత్ముని శివరాం (చీకటిపువ్వు), ఉత్తమనటి జ్యోతిరాజ్ (అందిన ఆకాశం), ఉత్తమ హాస్యనటుడు జీఎస్ చలపతిరావు (మనిషి మంచోడే), ఉత్తమ విలన్ సత్యనారాయణ (రాతిలోని తేమ), ఉత్తమ బాలనటుడు చిరంజీవి రోహిత్ (పిపీలికం), ఉత్తమ క్యారెక్టర్ నటి సురభి ప్రభావతి (గమ్యస్థానాల వైపు), ఉత్తమ సహాయనటి జి.లహరి (గుర్తుతెలియని శవం)లకు అవార్డులు లభించాయి. పోటీలకు న్యాయనిర్ణేతలుగా మల్లాది శివనారాయణ, టి.మధుకుమార్, కె.దేవేంద్రలు వ్యవహరించారు. కళాపరిషత్ నాటికల పోటీలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ అనంతవరం ఎన్టీఆర్ కళాపరిషత్ తరఫున నిర్వాహకులు గుదే పాండురంగారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకులు జి.పాండురంగారావు, వెంకట సుబ్బారావు, తారక రామారావు, వంశీ, సాంబ శివరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.